క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

వెంకటగిరి: పట్టణంలోని పాలకేంద్రం సెంటర్‌లో ఉన్న 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వెంకటగిరి ట్రాన్స్‌కో డీఈఈ మునిరవిచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: మన్నేముత్తేరి విద్యుత్ సబ్‌స్టేషన్, చెంగాళమ్మ ఆలయం సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు.

గూడూరులో..

గూడూరు: పట్టణ, రూరల్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా పట్టణ, రూరల్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 నుంచి, మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏడీ ప్రసాద్ తెలిపారు.

15న సైదాపురం మండల మీట్

సైదాపురం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 15వ తేదీన ఎంపీపీ పలుగోటి పెంచలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

దక్కిలి: స్థానిక తహసీల్దార్‌గా పీ రమేష్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ పద్మావతి వెంకటగిరికి బదిలీ అయ్యారు. తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌బాబుకు దక్కిలి తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ ఉన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం



బ్యాగుల తయారీపై శిక్షణలో పాల్గొన్న మహిళలు

వెంకటగిరిరూరల్: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు కేవీకే ఆధ్వర్యంలో జ్యూట్, క్లాత్ బ్యాగుల తయారీపై శిక్షణ తరగతులను శుక్రవారం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బీ గోవిందరాజులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. ఈ మేరకు మహిళలకు కేవీకే ఆధ్వర్యంలో బ్యాగుల తయారీపై వారం రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. గృహవిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి విజయశ్రీ, విశ్రాంత అధ్యాపకురాలు కుసుమకుమారి, మెప్మా, టీవీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సత్యనారాయణ స్వామి వ్రతం

దక్కిలి: మండలంలోని వెంబులూరు పంచాయతీలోని వెలుగొండలు కింద పెదకోన వద్ద ఉన్న ఆదిలక్ష్మి సమేత యోగలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మాఘమాసం సందర్భంగా శనివారం సత్యనారాయణస్వామి వ్రతం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు విజయకుమార్, సుబ్బారావు తెలిపారు. ఉదయం 7 గంటలకు స్వామివారికి అభిషేకం, అలంకరణ, 9 గంటలకు సత్యనారాయణస్వామి వ్రతం, 12 గంటలకు స్వామి వారికి పల్లకీ ఊరేగింపు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. సత్యనారాయణస్వామి వ్రతంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పేకాటస్థావరాలపై దాడులు

వెంకటగిరి: పట్టణంలోని బంగారుపేట దళితవాడ సమీపంలోని తెలుగుగంగ కాలువ వద్ద పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడులు చేసి, నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న రూ.2,450 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ జిలానీబాషా మాట్లాడుతూ కోడి పందాలు, సింగిల్ నంబర్ లాటరీ, పేకాట తదితర చట్టవ్యతిరేక కార్యక్రమాలు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో దాడులు విస్తృతం చేస్తామన్నారు.

నేత్రదానం

సూళ్లూరుపేట: పట్టణంలోని సాయినగర్‌కు చెందిన బీ విజయలక్ష్మి(67) శుక్రవారం నేత్రదానం చేశారు. పట్టణంలోని ఆచార్య భరద్వాజ సేవా సంస్థ వారు ఆమె మరణానంతరం నేత్రాలు సేకరించారు. ఇప్పటి దాకా 414 మంది నుంచి కార్నియాను సేకరించి, నెల్లూరు మోడరన్ ఆస్పత్రికి, చెన్నై బ్యాంక్ శంకర నేత్రాలయ వారికి అందజేశారు. వీటి ద్వారా 828 మంది అంధులకు కంటి చూపు ప్రసాదించారు.

కండలేరులో47.688టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటి కి 47.688 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రేగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,210 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 30, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిస్‌కు 70, హైలెవల్ స్లూయిస్‌కు 180 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

పార్టీకి వారధులు గృహసారథులు

- ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

కోట: గృహసారథులు ప్రజలకు పార్టీకి మధ్య వారధుల్లాంటి వారని, మీరు ప్రభుత్వ పథకాలను జనంల్లోకి తీసుకెళ్లడంతోపాటు వైఎస్సార్ సీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాల్సిన బాధ్యత మీపైనే ఉందని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. కోట ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సమాజంలో అసమానతలు తొలగిస్తూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఇచ్చిన హామీలు 98 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీకి మీరు గృహసారథులుగా పనిచేయడం గొప్ప అవకాశంగా భావించాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఈ నేపథ్యంలో జగనన్న ఇస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంటికీ వెళ్లి వివరించడమే మీ లక్ష్యమన్నారు. వలంటీర్లు ఎలాగూ ఉంటారని, ఇంకా ఎవరికైన సంక్షేమ పథకాలు అందని వారు, ఇతర సమస్యలను గుర్తించి వలంటీర్ల ద్వారా వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులపై ఉందన్నారు. మండల సచివాలయ కన్వీనర్‌గా కోటకు చెందిన మొబీన్‌ను నియమించారని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన నిత్యం పార్టీ కోసం శ్రమించే వ్యక్తి అని, మీకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటాడన్నారు. ముఖ్యమంత్రి మీపై ఉంచిన బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేర్చి పార్టీకి మంచిపేరు తేవాలని ఎమ్మెల్యే వరప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, సచివాలయ మండల కన్వీనర్ మొబీన్, సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ నరమాల రమణయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల ప్రసాద్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, గురుస్వామి, ప్రసాద్, సుధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్వే



సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

చిల్లకూరు: మహిళల సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండలంలోని పలు సచివాలయాల సిబ్బంది శుక్రవారం ఆయా గ్రామాల్లో సర్వే చేపట్టారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలోని సచివాలయ సిబ్బంది, ఐసీడీఎస్, వైద్య సిబ్బంది సంయుక్తంగా సర్వే చేసి, గ్రామాల్లో మహిళలకు సబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా తిమ్మనగారిపాళెం పంచాయతీలో సర్వే చేపట్టిన సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కళ్యాణ్ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామంలోని ప్రతి మహిళకు సబంధించిన స్థితి గతులతో పాటుగా వారి ఆరోగ్యం, వ్యక్తిగత శుభ్రత, పంచాయతీలో అందుతున్న వసతులతో పాటుగా మరి కొన్ని వివరాలను నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక పాల్గొన్నారు.

గృహసారథుల సమావేశం వాయిదా



మాట్లాడుతున్న జేసీఎస్ మండల కన్వీనర్ ఖాదర్‌బాషా

ఓజిలి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరగాల్సిన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథుల సమావేశం వాయిదా వేసినట్లు జేసీఎస్ మండల కన్వీనర్ షేక్ ఖాదర్‌బాషా తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో సమావేశం వాయిదా వేయాల్సి వచ్చిందన్నారు. మండలంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పాదర్తి హరనాథ్‌రెడ్డి, యల్లా సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌కు వినతి



సిన్హాకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ గురుమూర్తి, ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌రావు

వెంకటగిరి: బాలయపల్లి మండలం జయంపు రైల్వేస్టేషన్‌లో పూరి, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఏర్పాటు చేయాలని తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం గురుమూర్తి, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ శింగంశెట్టి భాస్కర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు భారతీయ రైల్వే ఆపరేషన్స్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం సభ్యురాలు జయవర్మ సిన్హాకు ఢిల్లీలోని ఆమె కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ఎంపీ గురుమూర్తి 'సాక్షి'తో మాట్లాడుతూ వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లో సుమారు 35 పరిసర గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉండే జయంపు రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఏర్పాటు చేస్తే ఆయా గ్రామాలవాసులను ఉద్యోగ, విద్య, ఆరోగ్య, వ్యాపారపరంగా ఆదుకున్నట్లు ఉంటుందని జయవర్మ సిన్హాకు వివరించానని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌రావు మాట్లాడుతూ గతంలో ఆయా రైళ్ల స్టాపింగ్ ఉండేవని, కరోనా పరిస్థితుల్లో ఆ స్టాపింగ్‌లను రద్దు చేసిన విషయాన్ని ఎంపీ గురుమూర్తి దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కార దిశగా ఆయన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

ఈ క్రాప్ నమోదు పరిశీలన



సిద్ధవరంలో పంటను పరిశీలిస్తున్న సోమసుందర్

రాపూరు: మండలంలోని సిద్ధవరంలో ఈ-క్రాప్ నమోదు చేసిన పంటలను శుక్రవారం వ్యవసాయాధికారి సోమసుందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు చేస్తుందని, రైతులంతా ఆ కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు ఈకేవైసీ చేసుకున్న రైతుల పంటను మాత్రమే కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తారని చెప్పారు. ఆయన వెంట డీటీ రవి, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

సూళ్లూరుపేట రూరల్: రైతులు తాము సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఏబీ చైర్మన్ మందా దేవేందర్‌రెడ్డి తెలిపారు. సూళ్లూరుపేట వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో ఏడీఏ నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం రైతులతో మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు ఈ-క్రాప్ తప్పనిసరి అన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయన్నారు. పంటను నమోదు చేస్తే వైఎస్సార్ ఉచిత బీమా వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ కవిత తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న జయరాజ్

ఓజిలి: జగనన్న భూరక్ష భూ సర్వే కార్యక్రమాన్ని అధికారులు వేగవంతం చేయాలని భూముల సర్వే జిల్లా అధికారి పీవీ జయరాజ్ అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్లు, సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రీ సర్వేపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. రీ సర్వేలో భూముల వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో సర్వే పూర్తి అయిన వెంటనే ఆర్‌ఓఆర్ ద్వారా గ్రామసభలను ఏర్పాటు చేసి, వివరాలను తెలియజేయాలని చెప్పారు. ప్రస్తుతం మండలంలో రీసర్వే మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. రీసర్వేలో అధికారులకు ఉన్న ఇబ్బందులను తెలుసుకుని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ఎం గోపిరెడ్డి, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ రైతులకు కత్తెరలు పంపిణీ



కత్తెరలు అందజేస్తున్న సర్పంచ్ రమణమ్మ, శ్రీనివాసరావు

గూడూరురూరల్: ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ పొందిన రైతులకు నిమ్మ పంటలో ఎండు కొమ్మలు కత్తిరించేందుకు అవసరమైన కత్తెరలను సర్పంచ్ కె.రమణమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కొండాగుంట ఎస్సీ కాలనీలో నిమ్మ రైతులకు ప్రకృతి సేద్యం విధానంలో మెళకువలు, ఆధునిక పద్ధతులపై శుక్రవారం ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీఐసీఐ ఫౌండేషన్ జిల్లా అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు ఉచిత పశు వైద్య శిబిరం, వర్మికం పోస్ట్ తయారు చేసుకునేందుకు వర్మీ యూనిట్లను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఫెసిలిటేటర్లు మస్తానమ్మ, మస్తానయ్య, గోపాల్ పాల్గొన్నారు.

నేడు సీనియర్ క్రికెట్ పోటీలు

చిల్లకూరు: సీనియర్ క్రికెట్ పోటీలు శనివారం కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామి క్రీడా మైదనంలో నిర్వహించనున్నట్లు శుక్రవారం నిర్వాహకులు తెలిపారు. సీనియర్ క్రికెట్ పోటీల నిర్వాహకులు మధు, రఘు, మోహన్ చిల్లకూరులో మాట్లాడుతూ 14 ఏళ్లగా మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సీనియర్‌లు ఒక చోట చేరి ఫిబ్రవరి రెండో శని, ఆదివారాల్లో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

ఉత్సవాల నిర్వహణపై తొలగిన ఉత్కంఠ



గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఈఓ

చిల్లకూరు: మండలంలోని ఏరూరులో ఉన్న భ్రమరాంభ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు శుక్రవారంతో తెర పడింది. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఏడేళ్లుగా శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నారు. దీనిపై గ్రామానికే చెందిన మరికొంత మంది ఉత్సవాలను చేసేందుకు ముందుకు రాగా గత ఏడాది ఆలయ ఈఓగా పనిచేసిన కోవూరు జనార్ధనరెడ్డి వచ్చే ఏడాది ఇతరులతో కల్యాణం నిర్వహించేలా చూస్తామని మాట ఇచ్చారు. అయితే ఈ ఏడాది కూడా తానే నిర్వహిస్తానని ఏడేళ్లగా నిర్వహిస్తున్న వ్యక్తి ముందుకు రావడంతో ఉత్కంఠ నెలకొంది. దీంతో ఈ వివాదం పరిష్కరించేందుకు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అందరూ ఏకాభిప్రాయంతో కల్యాణోత్సవం ఇతరులు నిర్వహించేలా తీర్మానం చేయండంతో సమస్య ఒక కొలికి వచ్చింది.

16న రాపూరమ్మ ఆలయ మహా కుంభాభిషేకం



రాపూరమ్మ విగ్రహం

రాపూరు: గ్రామదేవత రాపూరమ్మ ఆలయ మహా కుంభాభిషేకం ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు దేవస్థానం నిర్వాహకులు తెలిపారు. రాపూరమ్మ ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తి కావడంతో కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షబంధనం, రుత్విక్ హోమం, మృత్యం గ్రహణం అకురార్పణ, అమ్మవారి విగ్రహం జలాదివాసనం కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అలాగే ఈ నెల 15వ తేదీ యాగశాల ప్రవేశం, మహాకలశ అవాహన, ఆరాధన, ద్వారతోరణ, ధ్వజకుంభ పూజ శాంతిహోమం, నవగ్రహ హోమం, అమ్మవారి విగ్రహానికి ధ్యాన పుష్పఫల చాయదర్పణ చేస్తారన్నారు. 16వ తేదీన ఆలయ శిఖర ప్రతిష్ట , షోడష కలశ అభిషేకం, రత్న్యాస కలాన్యాస హోమం, మహా పూర్ణాహుతి, మహాకుశ్మాండబలి, చాయదర్శనం, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం



దక్కిలిలో అవగాహన కల్పిస్తున్న వెంకటగిరి సీఐ

దక్కిలి: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని వెంకటగిరి సీఐ రామకృష్ణ సూచించారు. డక్కిలి దేవుని వెల్లంపల్లి రోడ్డు సెంటర్, లింగసముద్రం గ్రామాల్లో ప్రజలకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు ఫోన్‌లో యాప్‌లు ద్వారా రుణాలు ఇస్తామని మోసం చేస్తున్నారని చెప్పారు. కొత్త నంబర్ల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌లు చేసి, మీ అకౌంట్ నంబర్, ఓటీపీ అడిగితే చెప్పవద్దని సూచించారు.

ఎస్సీ వర్గీకరణ హామీ అమలు చేయాలి



మాట్లాడుతున్న పల్లిపాటి రవి మాదిగ

వెంకటగిరి: అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీవర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ అధికారంలోకి వచ్చిన ఎనిమిదేళ్లు అయినా ఇప్పటి వరకూ ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం సరికాదని ఎమార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పల్లిపాటి రవి మాదిగ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ రహదారుల దిగ్బంధ కార్యక్రమంపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె మణి, కృష్ణ, పి మనోజ్, డి పవన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గూడూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

గూడూరు: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ కిరణ్‌కుమార్, తహసీల్దార్ లీలారాణితో కలసి శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని బాలుర, బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలను పరిశీలించిన ఆయన, సుమారు 4 వేల వరకూ ఓట్లు ఉన్న కారణంగా మౌలిక వసతుల కల్పనతోపాటు, అనువైన పరిసరాలు ఉండేలా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ క్రమంలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల అయితే అనువుగా ఉంటుందని తెలిపారు. రెండు పోలింగ్ కేంద్రాలతోపాటు, సహాయక పోలింగ్ కేంద్రాన్ని కూడా ఆయన పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్ రాంకుమార్ ఉన్నారు.

వాకాడులో..

వాకాడు: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల ఎంట్రీ, ఎలక్ట్రిసిటీ, ర్యాంప్, తదితర వసతులపై అధికారులతో చర్చించారు. ఈయన వెంట ఎంపీడీఓ గోపీనాథ్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సారంగపాణి, ఎస్‌ఐ రఘునాథ్, ఆర్ సెల్వ, సిబ్బంది ఉన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాలలో విద్యుత్ సౌకర్యం, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్ బాబు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్‌ఐ కృష్ణారెడ్డి, వీఆర్వో తేజ, కుమార్‌రాజ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయండి



టెలి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

సైదాపురం: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమల్లోకి వచ్చిందని, పక్కాగా కోడ్‌ను అమలు చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ కే వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. శాసనమండలి ఎన్నికల నిర్వహణపై శుక్రవారం ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని కోరారు. తహసీల్దార్ విజయలక్ష్మి, ఎస్‌ఐ పీ నాగబాబు, ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఆర్ అవినీతిపై విచారణలో అలసత్వం తగదు

నాయుడుపేట: మేనకూరు ఇండస్ట్రియల్ పార్కులో ఎస్ఎస్ఆర్ కంపెనీ అవినీతి అక్రమాలకు పాల్పడిందన్న ఆరోపణలపై సీబీఐ చేపట్టిన విచారణలో అలసత్వం తగదని రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి అన్నారు. నాయుడుపేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీఐఐసీ పరిధిలో రోడ్లు, కాలువలు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు రూ.175 కోట్లు నిధులు వెచ్చించారని తెలిపారు. రోడ్ల నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని ఆరోపించారు. స్వర్ణముఖి నదిలో ఇసుకను తోడి ఎస్ఎస్ఆర్ కంపెనీ పేరుతో నిల్వ చేసి, ఇతర రాష్ట్రాలకు తరలించారని, అందుకు టీడీపీ వంతపాడిందన్నారు. రూ.కోట్ల నిధులు దుర్వినియోగం చేయడంతోపాటు ఇసుకను తరలించి ప్రజా సంపదను దోచుకున్నారన్నారు. వీటిపై రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ కట్టా సురేఖారెడ్డి, ట్రేడ్ యూనియన్ కార్యదర్శిగా తాను సీబీఐకి విన్నవించామన్నారు. సమగ్ర విచారణ జరిపి అక్రమాలను వెలికితీయాలన్నారు.

రైతుల ప్రయోజనానికే పథకాలు



మాట్లాడుతున్న ఏడీఏ నాగార్జున సాగర్

వెంకటగిరి రూరల్: రైతుల ప్రయోజనం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఏడీఏ నాగార్జున సాగర్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వర్తింపజేయడంపై ప్రత్యేకదృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. రైతులు తాము సాగు చేస్తున్న పంటలకు ఈ-క్రాప్ నమోదుతోపాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. పంటలకు ఎస్‌ఎఫ్‌ఎస్‌ఎం కనీస మద్దతు ధర, డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా తదితర పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుజాత, ఏఏబీ కన్వీనర్ ధర్మానాయుడు, సభ్యులు కృష్ణారెడ్డి, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గిరిజన కుటుంబాల్లో విషాదం



ఈశ్వరయ్య(ఫైల్)



శీనయ్య(ఫైల్)

చిల్లకూరు: డయాలసిస్ చేయించుకుని ఆటోలో తిరిగి వస్తున్న యువకుడితో పాటుగా ఆటో డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో అక్కడిక్కడే మృతి చెందడంతో గిరిజన కుటంబాలలో విషాదం నెలకొంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని నెలబల్లిరెట్టపల్లె గిరిజన కాలనీకి చెందిన ఒంటెల ఈశ్వరయ్య(32) కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ నెల్లూరులో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈ క్రమంలో అతను అదే కాలనీకి చెందిన కోవూరు శీనయ్యకు చెందిన ఆటోలో వెళ్లి వచ్చేవారు. ఇందులో భాగంగానే గురువారం సాయంత్రం డయాలిసిస్ చేయించుకుని అర్ధరాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కాగితాలపూరు వద్ద అతి వేగంగా వచ్చిన ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు, ఆటోను ఢీ కొనడంతో ఆటోడ్రైవర్ శీనయ్య, ఈశ్వరయ్య అక్కడిక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న రెండు కుటుంబాల సభ్యులు ఆస్పత్రి వద్దకు చేరుకుని బోరున విలపించారు. తన పిల్లలను ఎలా పోషించుకోవాలో తెలియలేదు దేవుడా అని ఆటోడ్రైవర్ భార్య బోరున విలపించింది. ఈ సంఘటన అక్కడున్న వారిని కలచివేసింది.

బీఎస్పీ చైతన్యయాత్రను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

గూడూరు: బీఎస్పీ చైతన్యయాత్రకు బీఎస్పీ నాయకులే కాకుండా, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని బీఎస్పీ నాయకుడు సుధాకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని తపాలా కార్యాలయ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చైతన్యయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బీఎస్పీ చైతన్యయాత్ర శనివారం తిరుపతి జిల్లాలోకి రానున్నదన్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం బీఎస్పీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బందిలి అంకయ్య, మల్లికార్జున తదితరులున్నారు.

వైభవంగా లక్ష తులసి పూజ



లక్ష తులసి పూజలో పాల్గొన్న మహిళలు

గూడూరు: పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష తులసి పూజ ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు విశేషాలంకరణ చేసి, హోమం, పూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. లక్ష తులసి పూజలకు ఉభయకర్తలుగా ముప్పాళ్ల మురళీరాజు, వాసుదేవరాజు వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

గురుకులంలో సరస్వతీపూజ



నాయుడుపేట: మండలంలోని పుదూరులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ బాలికల గురుకులంలో శుక్రవారం పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులు సరస్వతీపూజ ఘనంగా నిర్వహించారు. గురుకుల ప్రాంగణంలోని సరస్వతీ విగ్రహానికి సుగంధ భరిత పుష్పాలతో అలంకరించి, రంగవల్లులు తీర్చిదిద్దారు. త్వరలో జరిగే పరీక్షల్లో అందరూ అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు దేవుని కృప అనుగ్రహించాలని విద్యార్థినులు దూప దీప, దూప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి సరస్వతీదేవి పటం వద్ద క్యాండిల్స్ వెలిగించి, కర్పూరహారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శశికళ, భూలక్ష్మి, శైలజ, చంద్రమ్మ, కాంతమ్మ, సునీత పాల్గొన్నారు.